క్లుప్తంగా

నగరపాలక సంస్థ కమిషనర్‌గా కోటేశ్వరరావు

నెహ్రూనగర్: గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి జూన్ 7వ తేదీ వరకు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిన నేపథ్యంలో ఆమె స్థానంలో కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)గా విధులు నిర్వహిస్తున్న పి. కోటేశ్వరరావుకు దాంతో పాటు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వాక్య నిర్మాణం, సాంఘిక శాస్త్రంలో ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథల్ని జువాలజీ అధ్యాపకురాలు మణి వివరించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు టేబుల్స్, స్పెల్లింగ్స్, నంబర్లు, మల్టిపికేషన్స్ నేర్పించారు. మానసిక వికాసం కోసం వివిధ ఆటల పోటీల్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తి మృతి



సుబ్బారావు (ఫైల్)

గుంటూరు ఈస్ట్: ఓ ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. వసంతరాయపురం 1వ లైనులోని ఓ ఇంటిలో కె.సుబ్బారావు (55) ఒంటరిగా నివసిస్తున్నాడు. అతడి వివరాలు ఇంటి యజమానికి కూడా తెలియదు. శుక్రవారం ఇంటి తాళం తీస్తుండగా, అకస్మాత్తుగా కిందపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 86888 31332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ శుక్రవారం తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన జి.విష్ణువర్ధన్‌బాబు (673), జె.జితేంద్రమోహన్ (2189), టి.శ్రీనివాస్‌రెడ్డి (2424), ఎం.వరుణ్ (2910), ఎం.పవన్‌సాయి (3163), జె.చంద్రశేఖర్ (3183) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థుల్ని చైర్మన్, వైస్ చైర్మన్ లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, ప్రిన్సిపాల్ జె.మోహన్‌రావు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి
కానిస్టేబుల్ సహా ఆరుగురు అరెస్టు

ప్రత్తిపాడు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి కానిస్టేబుల్ సహా ఆరుగురిని అరెస్టు చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైఎస్సార్ కాలనీలోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం శుక్రవారం ఎస్‌ఐకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్స్‌తో పాటు రూ. 25,300ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అయితే, దొరికిన వారిలో జిల్లా కేంద్రంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి వద్ద విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటివి జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ రవీంద్రబాబు కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏటుకూరు బైపాస్‌లోని ఆంధ్రా భోజనం హోటల్‌లో నారాయణ (50) పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం హోటల్ వెనుక పడి ఉన్న రేకుల షెడ్డు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న విద్యుత్ తీగలు తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఎన్టీఆర్ ణిముత్యాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఆణిముత్యాలు పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్ల విస్తరణ వేగవంతం చేయాలి

అదనపు కమిషనర్ పెద్ది రోజా



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్

నెహ్రూనగర్: పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్ల విస్తరణ వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో నగరపాలక సంస్థ ఆయా విభాగాలతో పాటు ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖలతో కూడా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఎక్కువ కాలం సాగితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ఏటీ అగ్రహారం విస్తరణ పనులు వేగంగా జరగాలన్నారు. విస్తరణ జరిగిన ప్రాంతంలో వెంటనే డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు, బకాయిలు చెల్లించని బోర్డులను వెంటనే తొలగించాలని సిటీ ప్లానర్‌కు స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లకు ప్రణాళిక అధికారులకు రోజువారి లక్ష్యాన్ని కేటాయించాలని తెలిపారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసుల వారీగా ప్రతి వారం సిటీప్లానర్ సమీక్ష చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు బాబూరావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, డీఈఈ రమేష్‌బాబు, టీపీఎస్‌లు, ఏఈలు పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ప్రత్తిపాడు: గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని మండలాల్లో బూత్ కమిటీల్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.వి.ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. ప్రత్తిపాడులోని వై. వేమారెడ్డి నివాసంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు ఖాజా సాంబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి అధ్వర్యాన దేశ ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాల్ని హర్షిస్తూ తీర్మానం చేశారు. ప్రత్తిపాడు మండలంలో ఇప్పటివరకు 45 బూత్ కమిటీలకు గాను 11 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన కమిటీల్ని కూడా ఏర్పాటు చేసే దిశగా పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 28న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పరాంకుశం శ్రీనివాసరావు, టుబాకో సెల్ స్టేట్ కో- కన్వీనర్ జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి, పార్టీ నాయకులు దార అంబేడ్కర్, అనిల్‌కుమార్, వెంకటశివయ్య పాల్గొన్నారు.

శివాలయానికి వాటర్ కూలర్ బహూకరణ



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన తూటుపల్లి నాగేశ్వరరావు, సరస్వతి దంపతులు వారి కుమారుడు ఈశ్వర వెంకట శ్రీనివాసశాస్త్రి జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను ఆలయానికి అందజేశారు. దాతల సమక్షంలో పూజలు చేసి కూలర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరికుప్పలు, గడ్డివామి దగ్ధం



కసుకర్రులో దగ్ధమైన వరికుప్ప

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం కసుకర్రులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎకరాల్లోని వరికుప్పలు, ఎకరం గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల నష్టం సంభవించింది. కసుకర్రు గ్రామానికి చెందిన కౌలు రైతులు పండు శ్రీనివాసరావు, సాంబయ్యకు చెందిన మూడు ఎకరాల వరికుప్పలు, జక్కా రవికి చెందిన ఎకరం గడ్డివామికి నిప్పంటుకుని పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమీప ప్రాంతాల్లోని పొలాల్లో వరికుప్పలు, గడ్డివాములు ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. వాటికి మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పొలంలోని విద్యుత్ తీగల రాపిడికి నిప్పురవ్వలు వరికుప్పలపై పడి అగ్ని ప్రమాదం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది మంటల్ని పూర్తిగా అదుపు చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రమశిక్షణకు, వికాసానికి క్రీడలు తోడ్పాటు



క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆలపాటి రాజా

తెనాలి: క్రీడలు వ్యక్తిగత క్రమశిక్షణతోపాటు పరిపూర్ణ వికాసానికి తోడ్పడుతాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కేబీఎస్ అండ్ కేవైఆర్ క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం ఆయన ఇక్కడి వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజ్ మైదానంలో ప్రారంభించారు. జూన్ 5వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథి ఆలపాటి రాజా మాట్లాడుతూ క్రీడలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా నేటిరోజుల్లో క్రికెట్‌కు అపూర్వ ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కోలా అశోక్, పట్టణ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, ఈదర వెంకటపూర్ణ చంద్, మంగమూరి హరిప్రసాద్, అత్తోట శరత్, నలుకుర్తి ప్రభాకర్, శేషగిరిరావు, కొరివి శ్రీనివాసరావు, చెన్నూరి రామారావు, బత్తుల ప్రసాద్, యర్రంశెట్టి వేణు, చెన్నంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

సత్కార సభలో చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



వలంటీరును సత్కరిస్తున్న ఖలేదా నసీమ్

తెనాలి: పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని నగదు బహుమతులతో సత్కరించటం గొప్ప ప్రోత్సాహకరమన్నారు. పట్టణంలోని 16వ వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఘనంగా సత్కరించారు. సచివాలయంలో ఏర్పాటైన సభకు కాళిదాసు విజయసత్యం అధ్యక్షత వహించారు. వలంటీరు కె.శ్రీనివాసరావు సేవారత్న అవార్డును అందుకోవటం సంతోషకంగా ఉందన్నారు. పలువురు వలంటీర్లు సేవామిత్ర అవార్డులను స్వీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు దుర్గారావు, నాగేశ్వరరావు, మరియదాసు, వలంటీర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత...

16వ వార్డులో ఇటీవల మరణించిన బుగ్గే నాగలలిత అనే మహిళ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ అందజేశారు. మిగిలిన రూ.90 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు.

ఏపీఎస్ ఆర్టీసీ సరికొత్త ప్రయాణం

స్టార్ లైనర్ స్లీపర్ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



స్లీపర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపోలో నూతనంగా తెనాలి-హైదరాబాద్‌కు ప్రవేశపెట్టిన రెండు స్టార్ లైనర్ స్లీపర్ బస్సులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన స్లీపర్ బస్సులు హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండగలవన్నారు. ముందుగా ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలికారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

నెహ్రూనగర్: నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభించాలనే ప్రధాన అంశంతో శనివారం అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సామాజిక ప్రజాస్వామికవాదుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కన్వీనర్ వై. కోటేశ్వరరావు (వైకే) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థకు అధిపతి అయిన రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం సబబు కాదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, ఉద్యోగ, ప్రజా, మహిళా సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఫార్మా-డీ విద్యార్థుల శిక్షణకు ఒప్పందం

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మా-డీ విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో అవగాహన ఒప్పందం కదుర్చుకున్నట్లు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందం ద్వారా విద్యార్థులు క్లినికల్ శిక్షణ పొందుతారని ఆయన పేర్కొన్నారు.


మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: పురిటిలో పసికందు మృతి చెందడంలో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్ గృహకల్ప అపార్టుమెంటులో నివాసం ఉండే సయ్యద్ (24), జాహెదాలకు కొన్ని సంవత్సరాల కిందట వివాహమైంది. గురువారం జాహెదాకు పాప పుట్టి వెంటనే మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన సయ్యద్ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తెనాలిలో ప్రజాచైతన్య సభ

తెనాలి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలనే ప్రజా చైతన్య కార్యక్రమాలను తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏడాదిపాటు నిర్వహిస్తోందని సమాఖ్య తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు శనివారం ప్రకటించారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ప్రజా చైతన్య సభను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాకతీయ సహకార సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగే సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు, సమాఖ్య ఆంధ్రప్రదేశ్ సమావేశకర్త డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు వక్తలని పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పులతో సహా అన్ని పనులు ప్రజల భాషలో జరగాలని, ప్రజలు, ప్రభుత్వంలో చైతన్యాన్ని పెంచాలనే ఉద్యమంలో భాగంగా జరిగే సమావేశంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని లక్ష్మణబాబు పేర్కొన్నారు.

తెనాలి వాసికి కె.ఎల్ వర్సిటీ డాక్టరేట్



తెనాలి రూరల్: తెనాలికి చెందిన బిట్రా హేమచంద్రరావు డాక్టరేట్‌ను పొందారు. కె.ఎల్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో ''లో-టెంపరేజర్ డై ఎలక్ట్రిక్ స్టడీ ఆఫ్ కార్బన్ అండ్ మాంగనీస్ డోపెడ్ కాపర్ ఆక్సైడ్'' అనే అంశంపై ఆయన పరిశోధన జరిపారు. గైడ్‌గా భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు పంపారు. హేమ చంద్రరావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

బాజీ బాబా దర్గాలో ముగిసిన ఆడిట్



పెదకాకాని: స్థానిక హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా బాబా దర్గాలో రికార్డులు నిర్వహణ సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర ఆడిట్ అధికారి ఎం. రాజాబాబు తెలిపారు. దర్గాలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆడిట్ తనిఖీలు శుక్రవారం ముగిశాయి. 2020-21, 2021-22 సంవత్సరాలకు గాను ఆడిట్ తనిఖీలను నిర్వహించినట్లు చెప్పారు. తనిఖీల్లో సీనియర్ ఆడిటర్లు ఎస్. రాధాకృష్ణమాచార్యులు, ఎస్.వి. సురేష్, దర్గా వక్ఫ్ బోర్డు ఈవో షేక్ ముక్తార్ బాషా పాల్గొన్నారు.

• గృహ సారథికి ఆత్మీయ స్వాగతం



తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాల పంపిణీకి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా

అంతర్జాతీయ సదస్సులో ప్రాతినిధ్యం వర్సిటీకి గర్వకారణం

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- బెస్ట్ డిప్లమాట్స్ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు అభినందన



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ అధ్యాపకులు పాల్గొని అధ్యయన పత్రాలు సమర్పించడం అభినందనీయమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'బెస్ట్ డిప్లమాట్స్' సంస్థ ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు దుబాయ్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఇందులో పత్రాలు సమర్పించిన ఏఎన్‌యూ అధ్యాపకులు ఆచార్య కె. మధుబాబు, ఆచార్య సరస్వతిరాజు అయ్యర్‌లను శుక్రవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సదస్సులో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యతల్ని సంతరించుకున్న అంశాలపై ఏఎన్‌యూ అధ్యాపకులు అధ్యయన పత్రాలు సమర్పించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఆచార్య మధుబాబు 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండస్ట్రియల్ సెక్టార్ ఇన్ అండర్ డెవలపింగ్ కంట్రీస్' అనే అంశంపై, ఆచార్య సరస్వతి రాజు ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆన్ ఇండస్ట్రీస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ వియత్నామ్' అనే అంశంపైన సమర్పించిన పత్రాలు విధాన నిర్ణయాల రూపకల్పనకు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ అధ్యాపకులందరూ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన అంశాలు సమర్పించాలని వీసీ సూచించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్దయ్య, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ అనిత, యూనివర్సిటీ ర్యాంకుల కో-ఆర్డినేటర్ భవనం నాగకిశోర్ తదితరులు అభినందనలు తెలిపారు.

హజ్ యాత్రికులకు ప్రత్యేక బస, ఏర్పాట్లు భేష్

మైనార్టీస్ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్



నంబూరు మదర్సాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇక్బాల్ అహమ్మద్

పెదకాకాని: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బస, ఏర్పాట్లు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహమ్మద్ తెలిపారు. హజ్ యాత్రికుల కోసం మండలంలోని నంబూరు సిరాజుల్ ఉలూమ్ మదర్సాలో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తొలిసారిగా హాజీలు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పవిత్ర మక్కా , మదీనా నగరాలకు నేరుగా విమానాల్లో వెళ్తున్నారని తెలిపారు. టికెట్ ధరలో వ్యత్యాసం గురించి డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్. గౌసల్ అజాం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగానే ఒక్కో హాజీ ఖాతాలో రూ. 80 వేలు జమ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ కమిటీ సభ్యుడు సయ్యద్ సుభాని పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ

ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులకు గాయాలు



ఆస్పత్రిలో సచివాలయ మహిళా పోలీసును పరామర్శిస్తున్న ఎస్‌ఐ రవీంద్రబాబు

ప్రత్తిపాడు: స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు-1 సచివాలయం మహిళా పోలీస్ రజిని, గనికపూడి సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శుక్రవారం అమరావతి రాజధానిలో జరిగిన సీఎం కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తున్నారు. మార్గంమధ్యలో ఏటుకూరు సమీపంలో గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో రజిని, భార్గవికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా పోలీసులను పరామర్శించారు. చికిత్స నిమిత్తం వారికి పదివేల రూపాయలను అందించారు.

హైకోర్టు న్యాయవాది రవికుమార్‌కు అభినందన



మేకల రవికుమార్‌ను సత్కరించిన ఆర్యవైశ్య నేతలు

తెనాలి: దుబాయ్‌లో ఈ నెల 19-22 తేదీల్లో జరిగిన 'బెస్ట్ డిప్లొమాట్స్' అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని వచ్చిన పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేకల రవికుమార్‌ను శుక్రవారం ఆయన స్వస్థలంలో సత్కరించారు. కృత్రిమ మేధ అంశంపై జరిగిన సదస్సుకు 65 దేశాల్నుంచి 175 మంది ప్రతినిధులు పాల్గొనగా, భారతదేశం నుంచి హాజరైన అయిదుగురిలో మేకల రవికుమార్ ఒకరు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ నేతృత్వంలో స్థానిక కొణిజేటి రోశయ్య మార్గ్‌లోని ప్రైవేటు కార్యాలయంలో రవికుమార్‌ను శుక్రవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించగలరన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తనకు జరిగిన సత్కారానికి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కొణిజేటి గోపీకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వర్లు, ఎన్వీ బ్రహ్మం, కొల్లా గురునాథ గుప్త, ఆలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.